ప్రజా

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల   సంపుటి : 05   సంచిక : 199   పేజీలు : 04   వెల రూ. 2   ఆదివారం   25 - 01 - 2026




నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

## సింగరేణిని పరిశీలిస్తేనే
# నిజాలు బయటపడతాయి

- తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సింగరేణి ఉద్యోగుల మానసికస్థైర్యాన్ని దెబ్బతీసేలా కథనాలు, పుకార్లు వస్తున్నాయని భట్టి విక్రమార్క ఆగ్రహం
- తప్పుడు కథనాలతో తన ప్రతిష్టను భంగం చేస్తానంటే ఊరుకోనని హెచ్చరిక
- టెండర్లు దక్కించుకున్నది బీఆర్ఎస్ నేతలేనని వెల్లడి
- ఎవరికి లబ్ధి చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉప ముఖ్యమంత్రి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి
- రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన



హైదరాబాద్ : తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా కథనాలు, పుకార్లు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు అంటూ ఒక పత్రిక రాసిన విషపు కథనంతో వివాదం మొదలైందని గుర్తు చేశారు. కట్టుకథలు, ఊహాగానాలతో రోజుకో కథ వండివారుస్తున్నారని, ఏ దోపిడీదారు కోసమే, ఎవరి ప్రయోజనాల కోసమో ఈ కథనాలు వస్తున్నట్లు అనిపిస్తోందని, కొద్దిమందికి లబ్ధి చేసేందుకు సింగరేణిలో సైట్ విజిట్ అనే నిబంధన పెట్టారని ఊహించుకుని రాశారని తెలిపారు. అనుకున్న వ్యక్తులకు టెండర్లు ఇచ్చేందుకే నిబంధనలు మార్చారని కథలు అల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైట్ విజిటింగ్ అనేది తనకు మేలు జరిగేందుకే పెట్టారని - మిగతా 2 లో

## ‘టీ హబ్’పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- టీ హబ్‌ను స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని సీఎం ఆదేశం
- ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి
- అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు
- టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దని స్పష్టం చేసిన సీఎం



హైదరాబాద్ : టీ హబ్‌ను ఒక ప్రత్యేక స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని, అందులోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ ఆఫీసులను - మిగతా 2 లో

## సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి సంజయ్
- ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ
- రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య



2 లో..

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందింది



ఢిల్లీ : భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు.తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక - మిగతా 2 లో


## 2047 నాటికి 350 ఎయిర్ పోర్టులు



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- భారత విమానయాన సంస్థలు ఇప్పటికే 1,700 కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయన్న మంత్రి రామ్మోహన్ నాయుడు
- దేశీయ విమానయాన సామర్థ్యం మూడు రెట్లు వృద్ధి చెందుతుందని వెల్లడి
- మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించిందన్న రామ్మోహన్ నాయుడు

ఢిల్లీ : 2047 నాటికి దేశంలోని విమానాశ్రయాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 164 నుండి 350కి పెంచడమే లక్ష్యమని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక - మిగతా 2 లో

## ప్రజానాడి




## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాలి

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్
- బాలికల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్న కందుల దుర్గేశ్
- వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాలని వ్యాఖ్య
- వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరిక
- బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి వాటికి గురికాకుండా కాపాడటం కీలకమని కందుల చెప్పారు



అమరావతి : సమాజంలో బాలికల భద్రత, వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాల్సి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ‘జాతీయ బాలికా దినోత్సవం’ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లలను కేవలం కాపాడుకోవడమే కాదు, వారిని ఉన్నత విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులు, సమాజం అందరిపైనా ఉందన్నారు.బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి వాటికి గురికాకుండా కాపాడటం అత్యంత కీలకమని చెప్పారు. బాలికల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు మాత్రమే కాదు... అధికారులు, - మిగతా 2 లో

## సమర్థ నాయకత్వంతో ప్రజల జీవితాల్లో పెనుమార్పులు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- సమర్థ నాయకత్వం ఉంటే ప్రజల జీవితాల్లో పెనుమార్పులు వస్తాయన్న సీఎం
- కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని దేశంలోనే 25 శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయన్నారు
- ఏడాది క్రితం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా ప్రారంభించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు
- స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు
- మార్చిలోపు 112 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని సీఎం చంద్రబాబు
- వారానికి ఒకసారి స్వచ్ఛ రథాలు వచ్చేలా చేస్తున్నామని, చెత్త తీసుకుని తిరిగి నిత్యావసర వస్తువులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని గుర్తు చేశారు



అమరావతి : ఏడాది క్రితం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా ప్రారంభించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. చిత్తూరు జిల్లా నగరిలో ఆయన పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని మన జీవన విధానం కావాలని పిలుపునిచ్చారు. మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలని, చెడు ఆలోచనలతో నేరస్థులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో చూశామని, స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. మార్చిలోపు 112 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని సీఎం చంద్రబాబు - మిగతా 2 లో

ప్రజా మాటలు



# సంపాదకీయం

## పొంచివున్న పెనుముప్పు



గుక్కెడు మంచినీళ్ల కోసం మున్ముందు ప్రపంచ ప్రజానీకం ఇక్కట్లు పడాల్సి ఉంటుందని నిపుణులు ఎప్పటినుంచో చేస్తున్న హెచ్చరికలు రేపో మాపో నిజం కాబోతున్నాయని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరిస్తున్నది. మనిషికే కాదు... సమస్త జీవకోటికీ గాలి తర్వాత నీరే ప్రాణాధారం. కానీ మారుతున్న పర్యావరణం, పెరిగిపోతున్న కాలుష్యంతో పాటు మితిమీరిన వినియోగం కారణంగా నీరు శరవేగంతో అడుగంటి పోతున్నదని ఆ నివేదిక చెబుతోంది. ముంచుకురానున్న ఈ ప్రమాద తీవ్రతను తెలియ జెప్పేందుకు నివేదిక కొత్త పదాన్ని ఎంచుకుంది. జల సంక్షోభం, జలగండం వంటివి అలవాటైన పదాలు. సంక్షోభం అనడంలో దాన్ని అధిగమించగలమన్న భరోసా కూడా ఏదో ఒక మూల ఉంటుంది. గండం అని చెప్పడంలో గట్టెక్కగలమన్న విశ్వాసం ఎంతో కొంత ధ్వనిస్తుంది. కానీ ముంచుకురాబోయే ముప్పు ఇంకెంత మాత్రమూ సాధారణ మైనది కాదు. అందుకే ఆ ముప్పును 'జల దివాళా' అంటోంది నివేదిక.ప్రకృతి మనకు వాన రూపంలో, మంచురూపంలో ప్రసాదించే జలరాశి ఆదాయంతో సమానమని, కానీ పొందుతున్న జలరాశిని మించి... చెప్పాలంటే అవసరాలను మించి నదులు, సరస్సులు, చిత్తడి నేలలు, భూగర్భ జలాశయాలు వగైరాల నుంచి మానవాళి పీల్చేస్తున్నదని నివేదిక రూపొందించిన ఐక్యరాజ్యసమితి యూనివర్సిటీకి చెందిన జల, పర్యావరణ, ఆరోగ్యసంస్థ డైరెక్టర్ కావే మదానీ అంటున్నారు. ఆదాయాన్ని మించి వ్యయం చేస్తే సర్వస్వం కోల్పోయిన విధంగానే కుంచించుకుపోతున్న నదీనదాలూ, సరస్సులు, అడుగంటుతున్న భూగర్భ జలాలు జీవకోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయని ఆయన భావన. కనీసం ఈ దశలోనైనా మేల్కొంటే ఆ దివాళాను నివారించటం సాధ్యమేనని ఆయన చెబుతున్నారు.నివేదికను గమనిస్తే ప్రపంచీకరణకూ, ఆవిరైపోతున్న నీటి వనరులకూ ఉన్న అవినాభావ సంబంధం తెలుస్తుంది. ప్రపంచంలోని అతి పెద్ద సరస్సుల్లో 1990 తర్వాతే నీరు అడుగంటుతున్నదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాన భూగర్భ జలాశయాల్లో 70 శాతం క్షీణత కనబడుతోంది. యూరోపియన్ యూనియన్(ఈయూ) భూభాగంతో సరిసమానమైన చిత్తడి నేలలు గత 50 ఏళ్లలో అంతరించగా, 1970 దశకం నుంచి చూస్తే హిమానీనదాలు 30 శాతం మేర కొడిగట్టాయి. నీటి వ్యవస్థపై అంతగా ఒత్తిడి లేని ప్రాంతాల్లో సైతం కాలుష్యం వల్ల మంచినీటి కొరత ఏర్పడటాన్ని ఈ నివేదిక ఎత్తిచూపు తోంది. నీటి కోసం భవిష్యత్తులో దేశాల మధ్యా, దేశాల్లో ప్రాంతాల మధ్యా వైషమ్యాలు పెచ్చరిల్లే అవకాశం ఉండొచ్చని అంచనా వేస్తోంది.నీటి వనరుల క్షీణత దాదాపు అన్ని ప్రాంతాలకూ వ్యాపించింది. ప్రతియేటా కనీసం ఒక నెలరోజులపాటు 400 కోట్లమంది ప్రజానీకం దాహార్తితో ఉంటున్నారు. అఫ్గాన్ రాజధాని కాబూల్ నగరం నీటి లభ్యతను పూర్తిగా కోల్పోనున్న తొలి ప్రపంచ నగరం కాబోతున్నదని నిపుణులంటున్నారు. మెక్సికో నగరమైతే ఏడాదికి 20 అంగుళాల చొప్పున నీరు కోల్పోతోందని చెబుతున్నారు. అమెరికాలోని లాస్ ఏంజెలెస్, లాస్ వేగాస్ నగరాలు, ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లలో నీటి పంపిణీకి పరిమితులు విధించక తప్పని స్థితి ఏర్పడినా పాలకులు మాత్రం వాటి విస్తరణను ఆపడం లేదు. 20032019 మధ్య ఇరాన్ 200 ఘన కిలోమీటర్ల (7,062 శతకోటి ఘనపుటడుగుల) నీటి నిల్వను కోల్పోయిందని అంచనా. పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. దక్షిణాసియాలో పెరుగుతున్న పట్టణీకరణ నీటి వనరుల్ని దెబ్బతీస్తోంది.మన దేశం సంగతికొస్తే ప్రపంచ జనాభాలో మనం 18 శాతం. కానీ ప్రపంచ స్వచ్ఛనీటిలో మన వాటా 4 శాతం. అమెరికా, చైనాల తర్వాత అత్యంత భారీగా భూగర్భ జలాలను వాడుతున్న దేశం మనది. గంగ, యమున, సబర్మతి నదుల్లో పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు వచ్చి కలుస్తున్నాయి. 56 శాతం జిల్లాల భూగర్భ జలాల్లో నైట్రేట్‌లు కలగలిసివుంటున్నాయని తేలింది. విచ్చలవిడి నీటి వినియోగం, జలకాలుష్యం నివారించటంతోపాటు భూగర్భజలాల పెంపునకు చర్యలు తీసుకుంటేనే సమితి నివేదిక చెప్పిన 'జల దివాళా' నుంచి మనల్ని మనం రక్షించుకోగలం. ముప్పు ముంచుకొచ్చే వరకూ పట్టనట్టు ఉండటం క్షేమం కాదు.

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

**మొదటిపేజీ తరువాయి** – సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు.యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## 2047 నాటికి 350 ఎయిర్ పోర్టులు

**మొదటిపేజీ తరువాయి** – వేదిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, భారత విమానయాన సంస్థలు ఇప్పటికే 1,700 కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయని, వీటి రాకతో దేశీయ విమానయాన సామర్థ్యం మూడు రెట్లు వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.ఏటా 10 నుండి 12 శాతం వృద్ధిరేటుతో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్‌గా ఎదగడమే కాకుండా, మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించిందని ఆయన వివరించారు. దేశీయంగా తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించడం ద్వారా గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ కీలక భాగస్వామిగా మారనుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ ను తొలగించిన ఐసీసీ!

**మొదటిపేజీ తరువాయి** – బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు ఐసీసీ లేఖ ద్వారా తెలియజేసినట్టు తెలుస్తోంది. 2007 నుంచి ప్రతి టీ20 ప్రపంచకప్‌లోనూ ఆడిన బంగ్లాదేశ్ ప్రస్థానానికి ఐసీసీ కఠిన నిర్ణయంతో తొలిసారి బ్రేక్ పడింది.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించి భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రతపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. ఈ సమస్యలను ఐసీసీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని ఆరోపిస్తూ, టోర్నమెంట్‌ను బహిష్కరిస్తున్నట్లు బీసీబీ గురువారం ప్రకటించింది. ఈ వివాదాన్ని డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీకి అప్పగించాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. కమిటీకి అప్పీళ్లపై విచారణ జరిపే అధికారం లేదని, ఐసీసీ తీసుకున్న నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసింది. టోర్నీలో పాల్గొనకపోతే స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తామని ఇచ్చిన అల్టిమేటంపై బీసీబీ నుంచి స్పందన రాకపోవడంతో ఐసీసీ ఈ నిర్ణయాన్ని అమలు చేసినట్టు సమాచారం. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఈ మార్పుతో స్కాట్లాండ్ జట్టు నేరుగా గ్రూప్ సిలో ప్రవేశిస్తుంది. ఈ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇటలీ, నేపాల్ వంటి జట్లు ఉన్నాయి. స్కాట్లాండ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇటలీ, ఇంగ్లాండ్, నేపాల్‌తో మ్యాచ్ లు ఉన్నాయి.స్కాట్లాండ్ ఇప్పటివరకు ఐదు టీ20 ప్రపంచకప్‌లలో పాల్గొంది. గత రెండు టోర్నీల్లో సూపర్ 8 దశకు చేరుకోలేకపోయినా, పెద్ద జట్లకు గట్టిపోటీనిచ్చింది.

## 'టీ హబ్'పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి** – టీ హబ్‌కు మారుస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు.ప్రస్తుతం అమెరికా పర్యటన లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌ల కోసం ఒక ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దాని స్వరూపాన్ని మార్చేలా ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచనలు ంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. ఏ పరిస్థితుల్లోనూ టీ హబ్ ప్రాధాన్యతను తగ్గించవద్దని ఆయన స్పష్టం చేశారు.

## బాలికల విషయంలో ఇప్పటికీ సమాజ దృక్పథంలో మార్పు రావాలి

**మొదటిపేజీ తరువాయి** – ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా భాగస్వాములేనని మంత్రి గుర్తు చేశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని హెచ్చరించారు.

# సమర్థ నాయకత్వంతో ప్రజల జీవితాల్లో పెనుమార్పులు

**మొదటిపేజీ తరువాయి** – తెలిపారు. చెత్త నుంచి కరెంట్ తయారు చేసే ప్రాజెక్టులు విశాఖ, గుంటూరులో వచ్చాయన్నారు. కర్నూలు, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరులో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వారానికి ఒకసారి స్వచ్ఛ రథాలు వచ్చేలా చేస్తున్నామని, చెత్త తీసుకుని తిరిగి నిత్యావసర వస్తులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని గుర్తు చేశారు. 2018లోనే రాష్ట్రాన్ని ఓడిఎఫ్‌గా తయారు చేశారు. ఇప్పుడు ఓడిఎఫ్ ప్లస్ దిశగా వెళు న్నామని చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సుమారు రూ. 573 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు, స్వచ్ఛతా వాహనాలకు శ్రీకారం చుట్టారు.'2018లోనే రాష్ట్రాన్ని ఓడీఎఫ్‌గా తయారుచేశాం. ఇప్పుడు ఓడీఎఫ్ ప్లస్ దిశగా వెళ్తున్నాం. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించిన ప్రాంతాలను అభినందిస్తున్నాం. పిల్లలకు పరిశుభ్రత చిన్నప్పటినుంచే నేర్పించాలి. రహదారుల పరిశుభ్రతకు 71 భారీ స్వీపింగ్ మిషన్లు తెస్తున్నాం. పరిశుభ్ర నగరిగా మార్చే బాధ్యత తీసుకుంటున్నాం. నాలుగేళ్లలో 26 వేల కి.మీ. మేర మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేశామన్నారు చంద్రబాబు.పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద మూడు ఉచిత సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా ద్వారా ఏటా 33 వేల కోట్ల పెన్షన్ల



పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగులు నింపామని తెలిపారు. విద్యార్థుల్లో పరిశుభ్రత కోసం ముస్తాబు కార్యక్రమం, వ్యర్థాల సేకరణకు 660 స్వచ్ఛ రథాలు, 110 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లను ఏర్పాటు చేస్తూ వచ్చే ఏడాది నాటికి పూర్తి స్థాయి పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.కుప్పం తరహాలో నగరి అభివృద్ధి: గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ పాలనలో శాండ్, మైన్, వైన్ అన్నింట్లో దోపిడీనే జరిగిందన్నారు. ఆఖరికి వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో నెయ్యి కూడా కల్తీనే అని ధ్వజమెత్తారు. నేనేదో క్రెడిట్ చోరీ చేస్తున్నానని ఆయన విమర్శిస్తున్నారని, పద్ధతి లేని రాజకీయాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచి ఆలోచనలు చేస్తున్నాం–మంచి పాలన అందిస్తున్నామన్నారు. కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం పేర్కొన్నారుమన రాజధాని అమరావతిగానే శాశ్వతంగా ఉంటుందని, ప్రపంచం మెచ్చేలే మారుస్తామన్నారు. గతంలో రాష్ట్రం మొత్తం గంజాయి మత్తులో నింపేశారని, ఇప్పుడు ఆ పంట ఎక్కడా పండించకుండా చేశామన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తయారుచేసే బాధ్యత తనది సీఎం అన్నారు. సమర్థ నాయకత్వం ఉంటే ప్రజల జీవితాల్లో పెనుమార్పులు వస్తాయన్న సీఎం, మంచి జరగాలంటే చెడును గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచనని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని సీఎం వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని రంగాలను ప్రక్షాళన చేశామన్నారు.18 నెలల్లో 20 లక్షల కోట్ల పెట్టుబడులు: 2024 ఎన్నికల ముందు రాష్ట్రం అతలాకుతలమైందని సీఎం అభిప్రాయపడ్డారు. మాట్లాడాలన్నా నవ్వాలన్నా భయపడే పరిస్థితి వచ్చిందని. తమ లాంటి వాళ్లనే జైల్లో పెట్టారంటే సామాన్యులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారన్నారు. రాష్ట్రంలో రాక్షస, సైకో పాలన జరిగింద సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సమైక్యంగా ఆలోచించి, మోదీ సహకరిస్తే మూడు పార్టీలు ఏకమై విజయం సాధించాయన్నారు. ప్రజలు ఆశీర్వదించి 94 శాతం అభ్యర్థులను గెలిపించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దేశంలోనే 25 శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయి అదీ సుపరిపాలన అని సీఎం చంద్రబాబు అన్నారు.

# సింగరేణిని పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయి

**మొదటిపేజీ తరువాయి** – రాశారని, ఒక పత్రిక కథనం ఆధారంగా మరో నేత ఒక లేఖ రాశారని పేర్కొన్నారు.సింగరేణి అనేది ఒక అటానమస్ సంస్థ అని, సింగరేణి సంస్థలో ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి సంస్థ ప్రోసీజర్స్ ప్రకారమే నిర్ణయాలు జరుగుతాయని అన్నారు. ఆరోపణలు రాగానే టెండర్లు రద్దు చేయాలని చెప్పి వెళ్లిపోయానని, తర్వాత అయినా తప్పు గ్రహించి మార్చుకుంటారని భావించానని తెలిపారు.సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు.టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ఆయన చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిపై కిషన్ రెడ్డి పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయని చెప్పారు.సైట్ విజిట్ అనే నిబంధన కోల్ ఇండియా 2018లో పెట్టిందని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కోల్ ఇండియా నిబంధన ప్రకారమే సైట్ విజిట్ తప్పనిసరి అని సింగరేణి సంస్థ 2021లో పెట్టిందని అన్నారు. 2018, 2021లో తాము అధికారంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. సెంట్రల్ మైనింగ్, డిజైనింగ్ అండ్ ప్లానింగ్ అనే సంస్థ సైట్ విజిట్ అనే నిబంధన పెట్టిందని, కేంద్ర ఆధీనంలోని ఎన్ఎండీసీ కూడా 2021లో బిడ్డర్లు సైట్ విజిట్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టిందని అన్నారు.దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ నిబంధనలు అమలు చేస్తున్నాయని, అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే, హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్‌లోనూ ఇదే నిబంధన ఉందని, కాంట్రాక్టర్, వెండర్ సైట్ విజిట్ చేయాలని హెచ్‌పీసీఎల్‌లోనూ ఉందని గుర్తు చేశారు."తెలంగాణ ఆస్తులు పరిరక్షించడం నా బాధ్యత. సింగరేణి ప్రాంతంలో మండుటెండల్లో పాదయాత్ర చేశాను. మంచి క్వాలిటీ ఉన్న బొగ్గు గనులను సింగరేణి సంస్థ దక్కించుకునేలా కృషి చేస్తున్నాం. సింగరేణి సంస్థ కేవలం బొగ్గుకే పరిమితం చేయకుండా కీలక ఖనిజాల మైనింగ్ చేపట్టేలా చేస్తున్నాం. నా పరువు, ప్రతిష్టకు భంగం కలిగేలా తప్పుడు కథనాలు రాశారు. 40 ఏళ్లుగా నేను సంపాదించుకున్న ప్రతిష్టను ఒక్క కథనంలో భంగం చేస్తానంటే ఊరుకోను. ఇప్పటికైనా వాస్తవం తెలుసుకుని తప్పు ఒప్పుకుంటారని ఆశిస్తున్నా.టెండర్లు దక్కించుకున్నది బీఆర్ఎస్ నేతలే : సైట్ విజిట్ అనే నిబంధన దేశంలో ఎక్కడా లేదన్నట్లు దుష్ప్రచారం చేశారని, ఒక పత్రిక దురుద్దేశంతో రాసిన కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని గుర్తు చేశారు. టెండర్లు రద్దు చేయకపోతే ప్రజల్లో అపోహలు పెరుగుతాయని వెంటనే రద్దుకు ఆదేశించానని గుర్తు చేశారు. మైనింగ్ సంస్థల్లో వాహనాలు నడుపుతున్న వారికి డీజిల్‌పై పన్ను




మినహాయింపు దేశంలో ఎక్కడా లేదని, డీజిల్ చోరీ జరగకుండా చూడాలని ఆదేశించానని, నైనీ కోల్ బ్లాక్‌కు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని అన్నారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, సృజన్‌రెడ్డి మామ ఉపేందర్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నది వాళ్లేనని, కాంట్రాక్టుల ఆశ చూపి కందాల ఉపేందర్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని తెలిపారు. సృజన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కల్యాణని ఓపెన్ టెండర్ దక్కించుకున్నది ఆర్.విద్యాసాగర్‌రావు సంస్థ అని, ఆర్‌జీ ఓసీ–2 టెండర్ దక్కించుకున్నది సీ–5 ఇంజినీరింగ్ సంస్థ, సీ–5 ఇంజినీరింగ్ డైరెక్టర్లు నిశాంత్‌రావు, మదన్‌మోహన్‌రావు బీఆర్ఎస్ నేతల బంధువులేనని తెలిపారు. ఎస్ఆర్‌పీ– ఓపీ2 టెండర్ సంస్థ దక్కించుకున్నది హర్ష కంపెనీ అని, తమ హయాంలో వేసిన 5 టెండర్లలో 4 టెండర్లు దక్కించుకున్నది బీఆర్ఎస్ నేతలేనని, పారదర్శక టెండర్ల వల్లే బీఆర్ఎస్ నేతలు కూడా టెండర్లు పొందగలిగారని భట్టి వివరించారు.

# సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి

**మొదటిపేజీ తరువాయి** – కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు పార్టీలూ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు.కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరుపుదామా అని మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానిస్తున్నారని... ఇదంతా చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అర్థమవుతోందని బండి సంజయ్ అన్నారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల కేటాయింపులు, దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీపై ప్రశ్నిస్తే గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు.తెలంగాణ సాధన కోసం సింగరేణి కార్మికులు పోరాటాలు చేస్తే... ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువగా గనుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేయకుండా సింగరేణికి సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే అవి తారుమారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ పాలనలో సింగరేణిని అప్పులపాలు చేసి, దోచుకున్న డబ్బుతోనే బీఆర్ఎస్ పార్టీని నడిపించారని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తీసుకొస్తామంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ నిధులను మళ్లించడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మేయర్, ఛైర్మన్ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతుంటే,



అసలు దోషులను సాక్షులుగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఫోన్ ట్యాపింగ్ చేసిన అసలు నిందితులను కాపాడుతున్నట్టేనని ఆరోపించారు. సిట్‌పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే దాని విశ్వసనీయత కోల్పోతుందని హెచ్చరించారు.కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ దేవాలయంలో కుటుంబంతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. హీరోయిన్లు, వ్యాపారులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నంబర్లను కూడా మావోయిస్టుల జాబితాలో పెట్టి ట్యాపింగ్ చేయలేదా? అని నిలదీశారు.

# క్రెడిట్ చోరీ అనేవారికి ఏం క్రెడిట్ ఉంది?

### నగరిలో సీఎం చంద్రబాబు

### నరకాసురుడి లాంటి వ్యక్తి మళ్లీ వస్తే రాష్ట్రం నాశనమవుతుందన్న చంద్రబాబు

### ల్యాండ్ టైట్లింగ్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేశామని వెల్లడి

### ప్రజల భూములకు రాజముద్రతో భద్రత కల్పించామన్న ముఖ్యమంత్రి

### గత ఐదేళ్ల రాక్షస పాలనలో రాష్ట్రాన్ని అతలాకుతలం చేశారని విమర్శ

గత ఐదేళ్ల రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందని, ఈ కాలంలో రాష్ట్రం అన్ని విధాలుగా అతలాకుతలమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా చేసిన గత ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. నగరిలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారని గుర్తు చేశారు."గత ఐదేళ్లలో రాక్షస పాలన వల్ల రాష్ట్రం అతలాకుతలమైంది. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారు. నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాం. 94 శాతం స్ట్రైక్ రేటుతో విజయం సాధించాం. గత పాలనలో అమరావతిపై మూడు ముక్కలాట ఆడారు. శ్మశానం, ఎడారి



అన్నారు. ఇప్పుడూ ప్రెస్ మీట్లు పెట్టి క్రెడిట్ చోరీ చేశామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. క్రెడిట్ చోరీ అనేవారికి ఏం క్రెడిట్ ఉందని మాట్లాడుతున్నారు?రాజధానిపైనా విషం చిమ్ముతున్నారు. నాపై నమ్మకంతో 29 వేల మంది రైతులు 33 వేలు ఎకరాల భూమి రాజధాని కోసం ఇచ్చారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి ఆగదు. ఆనాడు సైబరాబాద్ నగరాన్ని నిర్మించాను. నేడు అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశం ప్రజలు ఇచ్చారు. ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని తయారుచేస్తాం. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పేదల సేవలో, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం 2, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. 18 నెలల్లో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. దేశంలో 25 శాతం పెట్టుబడులు మన రాష్ట్రానికే రావడం ఎన్డీఏ ప్రభుత్వ సమర్థత పాలనకు నిదర్శనం" అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు భూమి అంటే సెంటిమెంట్ అని, అలాంటి భూమికి గత ప్రభుత్వంలో భద్రత లేకుండా చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. "ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అనే దుర్మార్గపు చట్టంతో, 22ఏ అక్రమాలతో ప్రజల జీవితాలతో వికృత క్రీడ ఆడారు. సర్వే రాళ్లు, పాస్ పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం కోసం రూ. 700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు" అని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టిందని తెలిపారు."మేం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించాం. రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందించి, మీ భూమికి మేం గ్యారెంటీ అని భరోసా ఇచ్చాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా సర్వనాశనం చేసి రాయలసీమను రాళ్ల సీమగా మార్చారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకే రాష్ట్రంలో తిరిగి అభివృద్ధి, సంక్షేమ పాలన మొదలైందని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన వివరించారు.

# మున్సిపల్ ఎన్నికల బరిలో తెలంగాణ జాగృతి

**సింహం గుర్తుతో రాజకీయ సమరానికి కవిత సిద్ధం**



**హైదరాబాద్, జనవరి 24 (ప్రజా మంటలు) :** తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపుతూ, తెలంగాణ జాగృతి పార్టీ చీఫ్ కవిత మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తుద నిర్ణయం తీసుకున్నారు. స్థానిక రాజకీయాల్లో తన ఉనికిని ఘాటుగా చాటేందుకు, పార్టీ అభ్యర్థులను సింహం గుర్తుతో బరిలో నిలపనుంది.పార్టీకి శాశ్వత గుర్తింపుగా సింహం గుర్తును ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలనే వ్యూహంతో, మున్సిపల్ ఎన్నికలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో కూడా ఇదే గుర్తును వినియోగించనున్నారు. దీనివల్ల గ్రామీణపట్టణ స్థాయిలో పార్టీ గుర్తింపు వేగంగా పెరుగుతుందని, అభ్యర్థుల ప్రచారానికి ఇది కీలకంగా మారుతుందని పార్టీ అగ్ర నేతలు భావిస్తున్నారు.పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) కు చెందిన సింహం గుర్తుతో పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ అంశంపై ఏఐఎఫ్‌బీ నాయకత్వంతో ముందస్తు చర్చలు జరిపి, అన్ని విధివిధానాలను సమీక్షించినట్లు సమాచారం.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ లాంటి ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలన్న సంకల్పంతో కవిత ఈ నిర్ణయం తీసుకున్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక జనసమూహాలతో నేరుగా అనుసంధానం పెంచుకుని, ప్రజాసమస్యలపై గళం విప్పుతూ, తెలంగాణ జాగృతి పార్టీని మున్సిపల్ ఎన్నికల ద్వారా బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టడమే లక్ష్యంగా ఈ అడుగు వేసినట్లు తెలుస్తోంది.ఈ ఎన్నికలు కవితకు రాజకీయ అస్తిత్వాన్ని నిరూపించుకునే కీలక వేదికగా మారనున్నాయన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# కంటోన్మెంట్ విలీన పోరాటానికి భారీ స్పందన

**శ్రీగణేశ్ దీక్షకు సంఘీభావం తెలిపిన ఎంపీ,ఎమ్మెల్సీలు**

**సికింద్రాబాద్, జనవరి 24 ( ప్రజామంటలు) :** కంటోన్మెంట్ ప్రజలపై కేంద్ర ప్రభుత్వం రుద్దుతున్న నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేసి, కంటోన్మెంట్ బోర్డును వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలనే డిమాండ్‌తో ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు భారీ మద్దతు లభిస్తోంది.శనివారం 5వ రోజున దీక్షా శిబిరాన్ని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు సందర్శించి ఆశీర్వచనం అందజేస్తూ సంఘీభావం తెలిపారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దీక్షా శిబిరానికి వచ్చి శ్రీగణేష్ పోరాటానికి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ దీక్ష వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, కంటోన్మెంట్ ప్రజల అభివృద్ధి, కేంద్ర నియంత్రణ నుంచి విముక్తి కోసమే జరుగుతోందని తెలిపారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన కంటోన్మెంట్ బోర్డుకు ప్రత్యామ్నాయంగా విలీనమే ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు.యంపీ ఈటెల రాజేందర్ వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విలీన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఈ అంశాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని తెలిపారు. అవసరమైతే ఢిల్లీలో ధర్నాకు సిద్ధమని ప్రకటించారు.వికాస్ మంచ్, రసూల్‌పుర క్రిస్టియన్ చర్చ్ ఫాదర్లు, ముస్లిం పెద్దలు, బోయిన్‌పల్లి మార్కెట్ హమాలీ సంఘం, మార్కెట్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్, బొల్లారం కైలాస్



గూడ వాసులు, వార్డు 5 కాలనీల సంఘాలు, మహిళలు, బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరన

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**రాయికల్ జనవరి 24 (ప్రజా మంటలు) :** రోడ్డు ప్రమాదాలను నియంత్రించి, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఒక కార్యక్రమశీ లో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కలెక్టర్ సత్య ప్రసాద్, డిఎస్పి రఘు చందర్ గార్ల తో కలిసి అరైవ్ అలైవ్ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ చేపడుతున్న " అరైవ్ అలైవ్ " కార్యక్రమం ఎంతో ప్రశంసనీయమని అన్నారు.చిన్న చిన్న తప్పిదాలు, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్ల కారణాలతో ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని, వాటితో కలిగే ఇబ్బందుల పై అవగాహన కల్పించాలని ఉద్దేశంతో " అరైవ్ అలైవ్ కార్యక్రమాన్నీ పోలీస్ శాఖ నిర్వహిస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ముఖ్యంగా ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్ ద్వారా అవుతున్నాయని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ....వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ ఒక పోలీస్ శాఖ వారి బాధ్యత కాకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని రోడ్లపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.

# జగిత్యాల పరిణామాలను అధిష్టానవర్గం పరిశీలిస్తుంది

**ఓటమిపాలైన తనకు మద్దతుగా జీవన్ రెడ్డి నిలిచారు**

**జీవన్ రెడ్డి సూచించిన హామీలను అమలు చేస్తా**

**రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**





**రాయికల్ జనవరి 24 ( ప్రజా మంటలు) :** కిందిస్థాయి కార్యకర్త నుండి వచ్చా తనకు కార్యకర్తల కష్టం విలువ తెలుసని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం కమిషన్ల కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుండి ప్రజాపాలనలు ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందుతున్నాయ న్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కలిసే పరిస్థితి లేకుండే అని ప్రజా పాలల్లో కార్యకర్త కూడా ముఖ్యమంత్రిని కలిసే వెసులుబాటు కల్పించిందన్నారు. మహాలక్ష్మి పథకం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని తెలిపారు. జీవన్ రెడ్డి సూచించిన మాదికుంట అభివృద్ధి, జగన్నాథ్ పూర్ వంతెనకు శంకుస్థాపన, ప్రభుత్వ ఆసుపత్రి స్థలం అన్యక్రాంతం కాకుండా ఏర్పాటు, ఫైర్ స్టేషన్ మంజూరు వంటి హామీలను అమలు చేద్దాం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జగిత్యాల పరిణామాలను గ్రహిస్తుందని, సీనియర్ కార్యకర్తలకు వెన్నంటి ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు ఇచ్చేందుకు పార్టీ అధిష్టాన వర్గం ఖచ్చితమైన వైఖరీతో ఉందన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి చొరవతోనే తాను మంత్రి అయ్యాయని కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అందుకు తానే నిదర్శనమన్నారు.చివరిదాక మంత్రి వర్గంలో తన పేరు లేదని చివరి నిమిషంలో తాను పడ్డ కష్టాన్ని గ్రహించి పార్టీ పెద్దలు తనకు మంత్రి పదవి కట్టబెట్టారని తెలిపారు.కార్యకర్తలు అధైర్యపడవద్దని మనకు మంచి రోజులు వస్తాయని చెప్పారు.పార్టీ కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేసి మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసేదాక పని చేయాలన్నారు.రాయికల్ మాదిగ కుంట అభివృద్ధికి కృషి చేస్తనని హామి ఇచ్చారు.జీవన్ రెడ్డి విజ్ఞప్తితో జగన్నాథ్ పూర్ బోర్నపల్లి బ్రిడ్జి మంజూరుకు తను మొదటి సంతకం చేసానన్నారు.

**కార్యకర్తల శ్రమ ఫలితంతోనే ప్రభుత్వం ఏర్పడింది**

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

జెండా మోసిన కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రభుత్వం అండగా నిలవాలని కార్యకర్తల శ్రమ ఫలితంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. కొంతమంది అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పనిచేస్తున్నానని అనడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గ, మున్సిపాలిటీల అభివృద్ధికి యూనివర్సల్ గా పథకాలను నిధులు కేటాయిస్తుందన్నారు.అభివృద్ధి అంటే నిరుపయోగంగా ఉన్న రాయికల్ ,జగిత్యాల్, బీర్పూర్ ఫిల్టర్ బెడ్ కు ఒక్కొక్క దానికి ఐదు కోట్లు చొప్పున 15 కోట్లు నిధులు, సిసి రోడ్లకు 10 కోట్లు, జగన్నాథ్ పూర్ బ్రిడ్జికి 17 కోట్లు, ధర్మపురి గోదావరి పరివాహ ప్రాంతానికి శుద్ధికి 25 కోట్లు, మాదిగ కుంట శుద్ధికి 6 కోట్లు, గతం లో బోర్నపల్లి బ్రిడ్జికి 70 కోట్లు నిధులు తీసుకురావడం అభివృద్ధి అంటారన్నారు. విద్య ప్రాధాన్యమిస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లు రాష్ట్రవ్యాప్తంగా 100 అనుమతి ఇచ్చారని మనకు కూడా వచ్చిందన్నారు. ఏ సి డి నిధులతో తాను రాయికల్ పట్టణంలో నీటి కొరత ఉన్న సుమారు 6 వార్డులకు నీరు అందించేందుకు కృషి చేశానన్నారు. మాయకుంట శుద్ధి చేసేందుకు అంచనా విలువలు చేపట్టానని తెలిపారు.ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్య,పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, మాజీ జెడ్పిటిసి గోపి మాధవి రాజరెడ్డి, మాజీ కౌన్సిలర్ మ్యా కల అనురాధ, మహిళ అధ్యక్షురాలు మమత,గుర్రం మహేందర్ గౌడ్,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మాలవత్ ప్రసాద్, ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, పట్టణ అధ్యక్షులు నాగరాజు,నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి,బాపురపు నర్సయ్య,కడకుంట్ల నరేష్, షాకీర్, మున్ను,రాకేష్,కొత్తపెల్లి గోపాల్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డిపై ప్రేమా.. బీజేపీ కార్యకర్తలపై నిర్లక్ష్యమా?

**ఎంపీ అరవింద్ ఒంటెద్దు పోకడలు మానుకోవాలి:**

**జగిత్యాల బీజేపీ సీనియర్ నేతల ఆగ్రహం**



**జగిత్యాల, జనవరి 24 (ప్రజా మంటలు) :** 40 ఏళ్ల పాటు కాంగ్రెస్‌లో పనిచేసిన జీవన్ రెడ్డిపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సానుభూతి వ్యక్తం చేయడాన్ని జగిత్యాల బీజేపీ సీనియర్ నేతలు తీవ్రంగా ఖండించారు. పరాయి పార్టీ నాయకులపై ప్రేమ చూపుతూ, పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడం సరికాదని విమర్శించారు.శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ నేతలు మాట్లాడుతూ, అరవింద్ గెలుపు కోసం ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్ల పార్టీ బలోపేతం దెబ్బతింటోందన్నారు. జగిత్యాల జిల్లాలో పార్టీని ఎంపీ ఎంతవరకు బలోపేతం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.గత మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాలపై నిర్లక్ష్యం కొనసాగిందని, కార్యకర్తలను దూరం చేసి ప్రజాదరణ లేని నాయకులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా గెలిచే అవకాశం ఉన్న సీనియర్ కార్యకర్తలను పక్కనబెట్టి తమ అనుయాయులకు టికెట్లు ఇవ్వాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.ఇప్పటికైనా ఎంపీ అరవింద్, భోగ శ్రావణి, మోరపల్లి సత్యనారాయణ రావులు ఒంటెద్దు పోకడలు మానుకోవాలని, లేదంటే బీజేపీకి తీవ్ర నష్టం తప్పదని హెచ్చరించారు. జగిత్యాలపై రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించి పార్టీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవా తత్పరుడు కాసుగంటి సుధాకర్ రావు సేవలు నేటి తరానికి స్ఫూర్తి

**ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**





**జగిత్యాల జనవరి 24 (ప్రజా మంటలు) :** ప్రముఖ విద్యావేత్త,సామాజిక వేత్త,పారిశ్రామిక వేత్త సరస్వతీ శిశు మందిర్, శ్రీవాణి జూనియర్ కళాశాల ఛైర్మెన్ కాసుగంటి సుధాకర్ రావు అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. కీర్తిశేషులు కాసుగంటి సుధాకర్ రావు ప్రథమ మాసికం( సంస్మరణ ) కార్యక్రమానికి పద్మనాయక కళ్యాణ మండపానికి హాజరై వారి చిత్రపటానికి నివాళు లర్పించి వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఎందరో నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వ్యవసాయ రంగంలో అధునాతన పనిముట్లు రైతన్నలకు అందించి రైతు బాంధవునిగా పేరు తెచ్చుకున్నారన్నారు. జగిత్యాల నడిబొడ్డున శ్రీ కాసుగంటి నారాయణరావు జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలకు 32 ఎకరాల భూమిని కాసుగంటి నారాయణరావు అందజేసి ఎందరో విద్యార్థులకు విద్యాదానం చేసిన కుటుంబానికి చెందిన కాసుగంటి సుధాకర్ రావు విద్యావేత్తగా పారిశ్రామికవేత్తగా ఆధ్యాత్మికవేత్తగా సామాజిక సేవలతో రోటరీ క్లబ్ ద్వారా ఎన్నో సేవలు అందించారని ఆయన చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తి కావాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ రావు తనయుడు కాసుగంటి జగదీష్ చందర్ రావు అల్లుడు కూతురు బొంత శ్రీనివాస్ రావు సౌజన్యలను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ డా భీమనాతి శంకర్ పద్మనాయక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఐల్నేని సాగర్ రావు పద్మనాయక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు పద్మనాయక సంఘ జనరల్ సెక్రెటరీ వేణుగోపాలరావు మాజీ అధ్యక్షులు ఒద్దినేని పురుషోత్తం రావు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆనందరావు కుమ్మరి పెల్లి సుధాకర్ రావు పట్టణ ప్రముఖులు ప్రజాప్రతినిధులు పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు అధ్యాపకులు పూర్వ ఉపాధ్యాయులు పూర్వ అధ్యాపకులు విద్యాసంస్థల యాజమాన్యాలు తదితరులు పాల్గొని సుధాకర్రావు సేవలను గుర్తు చేసుకున్నారు సుధాకర్ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## భండారు విజయ కథా సంపుటుల పరిచయ సభ



**హైదరాబాద్, జనవరి 24 (ప్రజా మంటలు) :** హైదరాబాద్ విమెన్ రైటర్స్, హస్మిత ప్రచురణ సంస్థలు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలో భండారు విజయ సంపాదకత్వంలోని 'పరిష్కృత' కథా సంకలనం మరియు ఆమె స్వీయ కథా సంపుటి 'సహజాత' పుస్తకాల పరిచయ సభను నిర్వహించాయి. వరంగల్ అరసం అధ్యక్షులు శ్రీ నిధి కార్యక్రమాన్ని ప్రారంభించి భండారు విజయ స్త్రీవాద రచనలపై పరిచయం చేశారు. సభాధ్యక్షులు, తెలంగాణ బీసీ కమిషన్ తొలి కమిషనర్ బి.ఎస్. రాములు ఆమెను మంచి స్త్రీవాద రచయితగా ప్రశంసించారు.ముఖ్య అతిథి ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్త్రీవాద దృక్పథంతో భండారు విజయ చేస్తున్న రచనలు సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. 'సహజాత'ను కీ.శే. అనిశెట్టి రజితకు అంకితం చేయడం అభినందనీయమన్నారు.'సహజాత'ను పరిచయం చేసిన సాహిత్య విమర్శకురాలు పి. జ్యోతి21 కథలు విభిన్న వస్తువులతో, మహిళల సమస్యలను ఆలోచింపజేసేలా ఉన్నాయని చెప్పారు.'పరిష్కృత' పుస్తకంపై నెల్లుట్ల రమాదేవి, కస్తూరి ప్రభాకర్ గృహహింస, లింగ వివక్ష వంటి అంశాలను కథలు ప్రభావవంతంగా చూపించాయని అన్నారు.జూపాక సుభద్ర కథలు యువత తప్పక చదవాలని సూచించారు.తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి భండారు విజయకు అభినందనలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. గ్రంథాలయ ఉద్యమ బస్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణతో కార్యక్రమం ముగిసింది.

## బుగ్గారం సాంబ శివ పంక్షన్ హాల్ నిర్మాణం కొరకు 20 లక్షల మంజూరు

**మంత్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్ర పటానికి పాలాభిషేకం బుగ్గారం గ్రామస్థులు**



**గొల్లపల్లి జనవరి 24 ప్రజా మంటలు :** బుగ్గారం మండల కేంద్రంలో శ్రీ సాంబశివ నాగేశ్వర ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణం కొరకు 20లక్షలు మంజూరు చేయించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బుగ్గారం గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేముల సుభాష్. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉప సర్పంచ్ జంగ లావణ్య శ్రీనివాస్,కోడిమ్యాల రాజన్న,తాడెపు లింగన్న , దసర్తి పోసన్న, పోనకంటి కైలాసం, బెజ్జారపు రాజు,పెద్దనవేణి రాగన్న నక్క శంకర్, పరుమాల సత్తన్న, సమీద్ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.

## దుబాయ్‌లో చిన్నమెట్‌పల్లి వాసి మృతి



**జగిత్యాల, జనవరి 23 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన ఆది బీరమల్లయ్య (57) దుబాయ్‌లో గుండెపోటుతో రెండు రోజుల క్రితం మృతి చెందారు. సుమారు 30 ఏళ్లుగా గల్ఫ్ దేశంలో ఉపాధి నిమిత్తం పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. స్నేహశీలి స్వభావంతో గ్రామంలో అందరికీ సుపరిచితుడైన బీరమల్లయ్య మృతి వార్త గ్రామంలో విషాదం నింపింది. మూడు రోజులలోనే మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## పంటల ధరల నిర్ణయం రైతులకే ఉండాలి: డా. జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్, జనవరి 24 (ప్రజా మంటలు) :** పంటల ధరలను నిర్ణయించే అధికారం రైతులకే ఉండాలని, మార్కెట్‌లో జరిగే మోసాలను నియంత్రించడం ప్రభుత్వాల బాధ్యత అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు.శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ శాఖ రిటైర్డ్ అధికారుల సంఘం రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం ఆందోళనకరమని, దళారుల పాత్ర తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. ఖరీఫ్‌కు ముందు భూసార పరీక్షలు చేసి రైతులకు సరైన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు.పత్తి, పసుపు, మిర్చి, పప్పు దినుసులు వంటి పంటల సాగు తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, పత్తికి కాటన్ టు క్లోత్ విధానం అమలు చేయాలని సూచించారు. వ్యాపారులు పంట ధరలు తగ్గిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి మాట్లాడుతూ పంటల మార్పిడి, సాంప్రదాయ వ్యవసాయం అవసరమని, విత్తనం రైతు హక్కు అని అన్నారు.

## చేనేత ఐక్య వేదిక, గొల్లపెల్లి మండల అధ్యక్షులుగా పెద్దూరి కుమారస్వామి



**గొల్లపల్లి జనవరి 24 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల అధ్యక్షులుగా, రంగధామునిపల్లె గ్రామానికి చెందిన, పెద్దూరి కుమారస్వామి , నియమకం పత్రం అందజేసిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు, గాజుల గంగమల్లేశం ,అందజేసినారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, చేనేతల ఐక్యతకు నా వంతు కృషి చేస్తానని.. నా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల సురేష్, ప్రధాన కార్యదర్శి అంకం భూమయ్య,రాష్ట్ర చేనేత ఐక్య వేదిక క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు గాజుల గంగ మల్లేశం ,కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ ,మల్లేశం, జలంధర్ ,తదితరులు, పాల్గొన్నారు.

## బీరయ్య ఆలయ అభివృద్ధికి నిధులు కోరుతూ కురుమ సంఘం నాయకులు చే ఎమ్మెల్యేకు వినతి



**జగిత్యాల జనవరి 24 ( ప్రజా మంటలు) :** ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన జగిత్యాల పట్టణ కుర్మ సంఘ నాయకులు సభ్యులు. జగిత్యాల బీరయ్య ఆలయ అభివృద్ధికి 5 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోరే గంగమల్లు అధ్యక్షులు పుల్ల మల్లయ్యా కార్యదర్శి మహేష్ కోశాధికారి పోచమల్లయ్య గట్టు రాజు,మల్లికార్జున్, డిష్ ప్రసాద్ , కురుమ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హమాల్ బస్తీ అంగన్వాడి సెంటర్ లో ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ




**సికింద్రాబాద్, జనవరి 24 (ప్రజా మంటలు) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని హమాల్ బస్తీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో పీ & జీ సంస్థ సహకారంతో శనివారం ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి సీడీపీఓ డా. స్వప్న, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు వనిత, ఐసీడీఎస్ సూపర్వైజర్ వి. జాహ్నవి హాజరయ్యారు. ప్రథమ్ కోఆర్డినేటర్ లలిత, మాస్టర్ ట్రైనర్లు మహేశ్వరి, నవనీత, అంగన్వాడి టీచర్ కులుసుం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి నెల నిర్వహించే ఈసీసీఈ (జుజజజు) డే కార్యక్రమాన్ని కూడా ఈ సందర్భంగా విజయవంతంగా నిర్వహించారు. చిన్నారులకు ప్రాథమిక విద్యపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వక్తలు తెలిపారు.

# తెలంగాణ షోరూమ్‌లోనే వాహన రిజిస్ట్రేషన్..

## తెలంగాణలో నేటి నుంచి కొత్త విధానం అమలు

**వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి**

**ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకపై ఉండదు**

**ద్విచక్ర వాహనాలు, కార్లకు మాత్రమే ఈ కొత్త విధానం వర్తింపు**

**రవాణా వాహనాల రిజిస్ట్రేషన్‌లు పాత పద్ధతిలోనే కొనసాగింపు**



తెలంగాణలో వాహన కొనుగోలుదారులకు ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పనున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఇకపై వాహనం కొనుగోలు చేసిన డీలర్ పాయింట్ వద్దే శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తిచేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ విధానం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు వాహనదారులకు వేగంగా సేవలు అందనున్నాయి.వాహనదారులకు సౌలభ్యం కల్పించే ఉద్దేశంతో ఈ నెల 8న రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ శ్రీకృష్ణ ఆటోమోటివ్స్ షోరూమ్‌లో ఈ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో సంయుక్త రవాణా కమిషనర్ (జేటీసీ) మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ స్వయంగా వాహనదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు.

**కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ ఇలా..**

నూతన విధానం ప్రకారం, వాహనం కొనుగోలు చేసిన తర్వాత డీలరే రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారు. ఇన్వాయిస్, ఫారం-21, ఫారం-22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వాహన ఫోటోలు వంటి అవసరమైన పత్రాలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, వెంటనే రిజిస్ట్రేషన్ నంబరు కేటాయిస్తారు. ఉదయం వాహనం కొంటే సాయంత్రంలోగా, సాయంత్రం కొంటే మరుసటి రోజు ఉదయంలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా వాహన యజమాని చిరునామాకు చేరుతుంది.

**వీటికి మాత్రమే వర్తింపు..**

అయితే, ఈ కొత్త విధానం కేవలం ప్రైవేట్ వాహనాలైన బైక్‌లు, కార్లకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. వాణిజ్య (ట్రాన్స్‌పోర్ట్) వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ యథావిధిగా ఆర్టీఓ కార్యాలయాల్లోనే కొనసాగుతుంది. ఈ విధానం అమలులో పారదర్శకత కోసం అవసరమైతే డీలర్ల షోరూమ్‌లలో తనిఖీలు నిర్వహిస్తామని రవాణా శాఖ తెలిపింది. ఈ నూతన విధానంపై రాష్ట్రంలోని 33 జిల్లాల అధికారులకు రవాణా శాఖ కమిషనర్ ఆన్‌లైన్ సమావేశం ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

# ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో భేటీ కానున్న కేటీఆర్, హరీశ్

**బీఆర్ఎస్‌లో ఒత్తిడి పెంచుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు**

**కాసేపట్లో ఫాంహౌస్‌కు వెళ్లనున్న కేటీఆర్, హరీశ్, ఇతర ముఖ్య నేతలు**

**తాజా పరిణామాలపై చర్చించనున్న నేతలు**

ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో బీఆర్ఎస్‌లో రాజకీయ ఉత్కంఠ పెరుగుతోంది. ఈ పరిణామాల మధ్య మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఈ మధ్యాహ్నం ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లనున్నారు. అక్కడ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పార్టీకి చెందిన ముఖ్య నేతల కీలక సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా కేటీఆర్, హరీశ్ రావులను సిట్ అధికారులు విచారించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిట్ దర్యాప్తు దూకుడుగా కొనసాగుతుండటంతో, పార్టీ నాయకత్వం కొంత ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అంతేకాదు, అవసరమైతే మాజీ సీఎం కేసీఆర్‌కు కూడా సిట్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందన్న చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోంది.ఈ పరిస్థితుల్లోనే కేసు తాజా పరిణామాలు, సిట్ విచారణలపై పార్టీ తీసుకోవాల్సిన వైఖరి, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కేసీఆర్‌తో విస్తృతంగా చర్చించేందుకు ఈ




సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. చట్టపరంగా ఎలా ముందుకెళ్లాలి, రాజకీయంగా ఎలా స్పందించాలి అన్నదానిపై నేతలు అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఉంది.మరోవైపు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ బలోపేతంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, నేతలు, కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన అంశాలపై మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేసే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు, మున్సిపల్ ఎన్నికలు... ఈ రెండు కీలక అంశాలు ఈరోజు ఎర్రవల్లి ఫాంహౌస్ సమావేశంలో ప్రధాన అజెండాగా ఉండనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# బళ్లారిలో టెన్షన్.. గాలి జనార్దన్ రెడ్డి భవనానికి నిప్పు

**బళ్లారిలో గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఇంటికి నిప్పుపెట్టిన దుండగులు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యే వర్గీయుల పనేనని సోదరుడి ఆరోపణ**

**ఇటీవల ఇరు వర్గాల మధ్య కాల్పుల ఘటన నేపథ్యంలో కలకలం**

**ఘటనపై కేసు నమోదు.. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**



కర్ణాటక రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓ భవనాన్ని దుండగులు దగ్ధం చేశారు. బళ్లారి కంటోన్మెంట్ ప్రాంతంలో నిన్న సాయంత్రం ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.ఈ ఘటన వెనుక కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మద్దతుదారులు ఉన్నారని గాలి జనార్దన్ రెడ్డి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర రెడ్డి ఆరోపించారు. భవనంపై పెట్రోల్, డీజిల్ పోసి ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ నెల 1న గాలి జనార్దన్ రెడ్డి ఇంటి వద్ద భరత్ రెడ్డి వర్గీయులు కాల్పులకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ వివాదం సద్దుమణగక ముందే ఇప్పుడు ఈ అగ్నిప్రమాదం జరగడం గమనార్హం.బళ్లారి నగరంలోని 'జీ స్క్వేర్ లేఅవుట్'లో ఉన్న ఈ 'మోడల్ హౌస్' విలువ సుమారు రూ. 3 కోట్లు ఉంటుందని అంచనా. 13 ఏళ్ల క్రితం కొనుగోలుదారులను ఆకర్షించేందుకు దీనిని నిర్మించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల కోసం గాలి జనార్దన్ రెడ్డి బెంగళూరులో ఉన్నారు. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ, ఇటీవల బ్యానర్ల గొడవ తర్వాత ఈ ప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బళ్లారి ఎస్పీతో మాట్లాడానని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ ఘటనతో బళ్లారిలో ఇరువర్గాల మధ్య రాజకీయ వైరం మరింత ముదిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఉజ్జయినిలో మత ఘర్షణలు.. వాహనాలకు నిప్పు, రాళ్ల దాడులు

**వీహెచ్‌పీ నేతపై దాడితో మధ్యప్రదేశ్‌లో ఉద్రిక్తతలు**

**ఉజ్జయిని జిల్లా తరానాలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ**

**బస్సులకు నిప్పు, రెండు డజన్ల వాహనాల ధ్వంసం**

**ఐదుగురు నిందితుల అరెస్ట్, పట్టణంలో సెక్షన్ 144**

**సీఎం సొంత జిల్లాలోనే హింసాత్మక ఘటనలు**



మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) స్థానిక నేతపై దాడి జరగడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసాత్మక ఘటనల్లో దుండగులు వాహనాలకు నిప్పుపెట్టడంతో పాటు రాళ్ల దాడులకు పాల్పడ్డారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు పట్టణంలో సెక్షన్ 144 విధించారు.ఉజ్జయిని జిల్లా తరానా పట్టణంలో వీహెచ్‌పీ గో సంరక్షణ విభాగం స్థానిక నేత సోహల్ ఠాకూర్ బుందేలాపై గురువారం సాయంత్రం కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఒకరినొకరు చూసుకోవడంపై మొదలైన చిన్న వాగ్వాదం ఈ దాడికి దారితీసిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సోహల్ తలకు గాయాలయ్యాయి.ఈ దాడి విషయం తెలియడంతో పట్టణంలో హింస చెలరేగింది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నాయి. కొందరు దుండగులు స్థానిక బస్ స్టాండ్‌లో ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ అల్లర్లలో ఒక బస్సు పూర్తిగా దగ్ధం కాగా, మరో 11 బస్సులు సహా రెండు డజన్లకు పైగా వాహనాలు ధ్వంసమయ్యాయి.వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు 300 మంది సిబ్బందిని మోహరించారు. సోహల్ ఠాకూర్‌పై దాడి ఘటనలో ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సొంత జిల్లాలోనే ఈ ఘర్షణలు జరగడం గమనార్హం. ప్రస్తుతం తరానాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, డ్రోన్లతో నిఘా కొనసాగిస్తున్నారు.

# మోండా మార్కెట్ గోల్డ్ షాపులో భారీ చోరీ

**రూ.25 లక్షల విలువ చేసే నగల మాయం**

**తాళాలు పగలగొట్టి దొంగతనం చేసిన దుండగులు**

**సిబ్బంది పనేనని అనుమానిస్తున్న పోలీసులు**



సికింద్రాబాద్ మోండా మార్కెట్ లోని ఓ గోల్డ్ షాపులో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. షాపు తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడ్డ దొంగలు రూ.25 లక్షల విలువ చేసే నగలను ఎత్తుకెళ్లారు. జర్గిష్ జువెలరీ షాపులో ఈ చోరీ జరిగింది. యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న మోండా మార్కెట్ పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే..దుకాణం తెరిచేందుకు వచ్చిన జర్గిష్ జువెలరీ షాపు యజమాని.. షటర్ తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి నిర్ఘాంతపోయారు. ఆందోళన చెందిన యజమాని లోపలికి వెళ్లి చూడగా.. కస్టమర్ ఆర్డర్ తో సిద్ధం చేసిన 16 తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు.. ఓ యువకుడు బ్యాగుతో వెళ్లిపోతున్న దృశ్యాలను గుర్తించారు. ఈ దొంగతనంలో షాపులో పనిచేసే సిబ్బంది హస్తం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# కీలక చర్యలు చేపట్టిన ఇండిగో

**వివిధ విమానాశ్రయాల్లో తమ విమానాల రాకపోకల కోసం కేటాయించిన స్లాట్లలో 717 స్లాట్లను ఖాళీ చేసిన ఇండిగో సంస్థ**

**ఇందులో మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచే 364 స్లాట్లు**

**అత్యధిక భాగం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందినవే**




దేశీయ విమానయాన రంగంలో ప్రముఖ సంస్థ అయిన ఇండిగో తన కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలలో తమ విమానాల రాకపోకల కోసం కేటాయించిన స్లాట్లలో 717 స్లాట్లను ఇండిగో సంస్థ ఉపసంహరించుకుంది. ఇందులో ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల నుంచి 364 స్లాట్లు ఉండగా, వాటిలో అధిక శాతం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందినవి కావడం గమనార్హం.విమానాశ్రయం నుంచి విమానం టేకాఫ్ లేదా ల్యాండింగ్ కోసం కేటాయించే వ్యవధిని సాధారణంగా స్లాట్‌గా వ్యవహరిస్తారు. ఇండిగో సంస్థ జనవరి నుంచి మార్చి మధ్య కాలానికి చెందిన స్లాట్లను వదులుకోగా, మార్చి నెలలో అత్యధికంగా 361 స్లాట్లను ఖాళీ చేసినట్లు సమాచారం. గత డిసెంబరులో ఇండిగో సంస్థ వేల సంఖ్యలో విమాన సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ పరిస్థితులను తీవ్రంగా పరిగణించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఇండిగో వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత విధించింది. ఈ చర్యల అనంతరం ఇండిగో కార్యకలాపాలు క్రమంగా స్థిరపడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి

**రవీంద్ర ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించారన్న సీఎం చంద్రబాబు**

**అభివృద్ధి కార్యక్రమాలతో అనంతపురం జిల్లా ప్రజల విశ్వాసాన్ని పొందారని కితాబు**

**ఎక్స్ వేదికగా చంద్రబాబు నివాళి**



మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన నేతగా పరిటాల రవీంద్ర ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు.ప్రజాసేవనే ధ్యేయంగా రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలతో అనంతపురం జిల్లా ప్రజల విశ్వాసాన్ని పొందారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ వేదికగా నివాళులర్పించారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పరిటాల అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com